క్లుప్తంగా

అంతర పంటలను సాగు చేసుకోవాలి


కంది మినీకిట్స్‌ను రైతులకు పంపిణీ చేస్తున్న ఏఓ శ్రీనివాసరెడ్డి

కల్లూరు: మండలంలో పత్తి, ఆముదం, ఇతర పంటల్లో అంతర పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి రైతులకు సూచించారు. గురువారం కొంగనపాడు గ్రామ రైతు భరోసా కేంద్రంలో ఎల్‌ఆర్‌జీ–52 రకం కంది మినీ కిట్స్ ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలానికి 1,457 ప్యాకెట్లు మంజూరైనట్లు తెలిపారు. కంది మినీ కిట్స్ కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకుడిని సంప్రదించాలన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

సి.బెళగల్: మండలంలో బాల్య వివాహాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ ఆదేశించారు. ఇందుకు జిల్లా అధికారులు ఓ కమిటీని నియమించినట్లు వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కొత్త కమిటీకి మండలంలో తహసీల్దార్ కన్వీనర్‌గా, ఎంపీడీఓ రాముడు కో కన్వీనర్‌గా ఉంటారన్నారు. సభ్యులుగా మండల అధికారులు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, మల్లేశ్వరి, ఎంఈఓ జ్యోతి, ఎస్‌ఐ పీరయ్య, మండల వైకేపీ ఏపీఎం వెంకటస్వామి, సి.బెళగల్ పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఉమామహేశ్వరి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు సృజన, ఎన్జీఓలు ఉంటారని తెలిపారు.

ఎన్నో ఏళ్ల నిరీక్షణ ఫలించింది


బేరి రాజ్‌కుమార్

గడివేముల: కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంతో తమ ఎన్నో ఏళ్ల నిరీక్షణ ఫలించిందని గడివేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఫార్మసిస్ట్ బేరి రాజ్‌కుమార్ అన్నారు. ఈసందర్భంగా ఆయన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. తాను 2002 నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. తమ గోడును గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో అరకొర జీతాలతో తీవ్ర ఇబ్బందులు పడ్డామన్నారు.

ప్రతి చిన్నారికి ఆధార్‌కార్డు



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ జయలక్ష్మి

గడివేముల: 0–5 సంవత్సరాల చిన్నారులందరికీ ఆధార్‌కార్డు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి అంగన్‌వాడీ టీచర్లకు చెప్పారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి చిన్నారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యల తప్పవన్నారు.

సూపర్‌వైజర్ బదిలీ

గడివేముల ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న కుమారి గోస్పాడుకు బదిలీ అయ్యారు. ఆదోనిలో పనిచేస్తున్న సూపర్‌వైజర్ జయలక్ష్మి బదిలీపై ఇక్కడికి వచ్చి గురువారం బాధ్యతలు స్వీకరించారు.

పారదర్శకంగా భూముల రీసర్వే


పాన్నకల్‌లో భూ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

గూడూరు రూరల్: మండల వ్యాప్తంగా గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సర్వేయర్లకు తహసీల్దార్ ఆంజనేయులు ఆదేశించారు. మండల పరిధిలోని పాన్నకల్, జూలకల్‌లో చేపట్టిన సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రీ సర్వే చేపట్టిందన్నారు. పాన్నకల్, జూలకల్‌లో మూడు సర్వే టీంలను ఏర్పాటు చేసి సర్వే జరుపుతున్నామన్నారు. త్వరలోనే భూ సర్వేను పూర్తి చేసి రైతుల మధ్య నెలకొన్న వివాదాలకు పరిష్కారం చూపనున్నట్లు ఆయన తెలిపారు.

మద్యం దుకాణాల తనిఖీ

గడివేముల: మండల కేంద్రం గడివేములలో ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. రెండు దుకాణాల్లో కాలం చెల్లిన బీర్లు ఉండటంతో వాటిని పారవేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన వేళల్లో మాత్రమే దుకాణాలు తెరవాలన్నారు. బెల్టు దుకాణాలకు మందులు సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు మద్యం అమ్మకాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సందీప్, శ్రీనివాస్, కానిస్టేబుల్ రామచంద్రుడు, సూపర్‌వైజర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాటసాని
- ఓర్వకల్లులో మూడోరోజు సాగిన కార్యక్రమం


మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు.మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామంలో మూడో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీటీసీ రంగనాథ్‌గౌడు, సర్పంచు తోట అనూష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటూనే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం గ్రామంలోని 3,4,5 వార్డుల్లో పర్యటించి మాట్లాడారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు వ్యత్యాసాన్ని గుర్తించాలని ప్రజలను కోరారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. అభివృద్ధి విషయంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడంలో తమ ప్రభుత్వం ముందు వరుసలో ఉందన్నారు. ఇళ్ల స్థలాలు రాని వారు ఎలాంటి బెంగ పెట్టుకోవద్దని, త్వరలోనే అందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామన్నారు. జగన్ సర్కారు చేస్తున్న మేలును గుర్తించుకుని వచ్చే ఎన్నికల్లో మరో సారి ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు శంకర్‌రెడ్డి, మీనిగ చంద్రశేఖర్‌రెడ్డి, మద్దిలేటి, శాలుమియా, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఇంజినీర్లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలోని జగనన్న కాలనీలో లబ్ధిదారు శ్రీదేవి, శివశంకర్ దంపతులు ఇల్లు నిర్మించుకున్నారు. గురువారం వారు నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులతో గృహ ప్రవేశం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు మండలం నెరవాడ వక్కెర వాగుపై నూతనంగా నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు సకాలంలో పూర్తి చేయలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


పెద్దటేకూరు జగనన్న కాలనీలో నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ఉద్యానవన అధికారి నాగరాజు


నర్సరీ లైసెన్స్‌లు పొందిన రైతులతో ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు

పాణ్యం: ఉద్యానవన బోర్డు నుంచి రైతులకు అనేక రాయితీలు ఉన్నాయని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన అధికారి నాగరాజు అన్నారు. గురువారం పాణ్యంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పాణ్యంలోని నర్సరీ రైతులతో సమావేశం నిర్వహించి లెసెన్స్‌లు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా మొక్కలు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. వినియోగదారులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన మొక్కలను సరఫరా చేయాలన్నారు. లైసెన్స్ తీసుకున్న ప్రతి రైతు మూడేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలన్నారు. వచ్చే ఏడాది జిల్లాలో 2 వేల హెక్టార్లలో ఉద్యాన తోటల సాగుకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. 15–18 ఏళ్లు పూర్తి చేసుకున్న మామిడి చెట్ల నిర్వహణకు హార్టికల్చర్ బోర్డు అనేక రాయితీలు అందిస్తుందన్నారు. మామిడి ఎగుమతులకు అవకాశం కల్పించాలని రైతులు కోరగా ఎంపీఓఎస్‌లో సభ్యులుగా చేరితే రైతు వద్దకే ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి పంటను కొని ఇతర దేశాలకు ఎగుమతులు చేస్తారన్నారు. డోన్ నియోజకవర్గంలో ఎగుమతుల కోసం రూ.50 కోట్లతో స్టోరేజీని నిర్మిస్తున్నామన్నారు. కొత్తగా కొబ్బరి సాగు చేసుకునే వారికి రాయితీ అందిస్తున్నామని, ఆయా గ్రామ హార్టికల్చర్ అధికారి వద్ద నమోదు చేసుకోవాలన్నారు. ఉపాధిహమీ పథకం కింద చామంతి మొక్కలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కొత్తగా నర్సరీ లైసెన్స్ పొందిన రైతులకు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సుబ్రమణ్యం, ఉద్యావన అధికారి దివ్య, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, బాబు, ప్రశాంత్‌కుమార్, చంద్రకళ, యామిని, నర్సరీల రైతులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలతో పనిచేయిస్తే కఠిన చర్యలు


గడివేముల దుకాణంలో తనిఖీలు చేస్తున్న కార్మికశాఖ అధికారులు

గడివేముల: దుకాణాలు, మెకానిక్ షాపుల్లో చిన్న పిల్లలతో పనిచేయిస్తే కఠిన చర్యలు తప్పవని కార్మిక సహాయ అధికారి సమీర్ హెచ్చరించారు. గురువారం మండ కేంద్రం గడివేములలో బాల కార్మిక నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా వివిధ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. బాలకార్మికులతో పనులు చేయిస్తున్న యజమానులకు హెచ్చరించి, సూచనలు చేశారు. చిన్నపిల్లలతో పనులు చేయించకుండా బడుల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మికశాఖ సిబ్బంది విద్యావతమ్మ, మురళీకృష్ణ, వేదమణి, ఎన్‌జీఓ సుబ్బరాయుడు, ఐసీడీఎస్ అధికారిణి స్వేత తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

కల్లూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ టీవీ రమేష్‌బాబు, ఎంపీడీఓ జీవీ రమణమూర్తి అన్నారు. అధికారులు గురువారం బస్తిపాడు, దొడ్డిపాడు జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈపథకం కింద అర్హులైన పేదలకు ఇంటి స్థలంతో పాటు గృహం మంజూరు చేస్తుందన్నారు. త్వరగా గృహం కట్టుకునేందుకు బిల్లులతో పాటు ఇసుక, సిమెంట్, ఐరన్ ఇతర మెటీరియల్‌ను అందిస్తుందని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, ఎంపీటీసీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో కాన్పులు

-అధికారులకు డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య ఆదేశం


ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

కల్లూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు జరిగేలా చూడాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ రామగిడ్డయ్య వైద్యాధికారులకు ఆదేశించారు. గురువారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులను గుర్తించి ఆ వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఏఎన్‌ఎంలు ప్రతి రోజు 10 హెల్త్ ఐడీ జనరేట్ చేయలన్నారు. ఎన్‌సీడీ సర్వేను 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనందరావు, పర్యవేక్షకులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి


గార్గేయపురంలో అటెండెన్స్ రిజిష్టర్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ అజాంఖాన్

కర్నూలు (న్యూటౌన్): గ్రామ సచివాలయ సిబ్బంది ప్రతి రోజూ నిర్ణీత సమయంలోగా బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ ఆదేశించారు. గురువారం కర్నూలు మండలం నందనపల్లె, గార్గేయపురం–2 గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టికలను పరిశీలించారు. అంతకుముందు నందనపల్లె రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ఆ తర్వాత గార్గేయపురంలోని జగనన్న కాలనీని సందర్శించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించే బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని అన్నారు. రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గార్గేయపురం మాజీ సర్పంచ్ ఏసేపు, సచివాలయ కన్వీనర్ సురేష్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ముగిసిన పది సప్లిమెంటరీ

సి.బెళగల్: గత వారం రోజులుగా జరుగుతున్న పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ముగిశాయి. మండల కేంద్రం సి.బెళగల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల, మోడల్ స్కూళ్లలో పది సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. చివరి రోజు సోషల్ పరీక్షకు 23 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు అధికారులు తెలిపారు. కాగా సోషల్ పరీక్షకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 54 మందికి గాను 46 మంది హాజరయ్యారు. అదేవిధంగా మోడల్ స్కూల్లో 52 మంది విద్యార్థులకు గాను 37 విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

మండలంలో మోస్తరు వర్షం

సి.బెళగల్: మండలంలో బుధవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. 18.2 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైనట్లు ఏఓ మల్లేష్‌కుమార్ తెలిపారు. వానలకు రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మండలంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.

గూడూరులో 25.02 మి.మీ వర్షం

గూడూరు: పట్టణంలో గురువారం 25.02 మి.మీ. వర్షపాతం నమోదైంది. బుధవారం రాత్రి నుంచి వాన కురవడంతో రైతులు సంతోషం వ్యక్త చేస్తున్నారు.

13న మండల మీట్

సి.బెళగల్: ఈనెల 13వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాముడు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల మండల అధికారులు అభివృద్ధి నివేదికలు తయారు చేసి సమర్పించాలని కోరారు.

సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు

గూడూరు రూరల్: ఖరీఫ్‌లో వేరుశనగ పంటలు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు అందిస్తుందని వ్యవసాయ అధికారి శ్రీవర్ధన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో బదిలీలు

గడివేముల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి (ఏఓ)గా పనిచేస్తున్న విజయసింహారెడ్డి గూడూరుకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో చాగలమర్రి నుంచి చంద్రశేఖర్ వచ్చారు. అలాగే గడివేములలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌రెడ్డి అలూరు సబ్‌డివిజన్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో కర్నూలు జిల్లా పరిషత్ నుంచి సిద్దారెడ్డి వచ్చారు.

హౌసింగ్ ఏఈగా అహ్మద్‌బాషా

పాణ్యం: పాణ్యం మండల హౌసింగ్ ఏఈగా శిరివెళ్ల ఏఈ అహ్మద్‌బాషను నియమించారు. ఇక్కడ పని చేస్తున్న నాగేశ్వర్‌ను శిరివెళ్లకు బదిలీ చేశారు. నూతన ఏఈ గురువారం బాధ్యతలు స్వీకరించి సచివాలయాల వారీగా గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారులు త్వరగా గృహాలు నిర్మించుకునేలా చూడాలని చెప్పారు. అలాగే పెండింగ్ బిల్లులను త్వరగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో వర్క్ఇన్‌స్పెక్టర్లు నాయక్, సచివాలయ ఇంజినీరు మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓను కలిసిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన అజాంఖాన్‌ను గురువారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీఓ మాట్లాడుతూ పేదల సొంతింటి కలలను నిజం చేయడంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కీలకపాత్ర పోషించాలన్నారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యత

కర్నూలు(రాజ్‌విహార్): పిల్లల్లో మానసిక ఉల్లాసాన్ని పెంచేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో తైక్వాండో, కరాటే విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన కిట్లను అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్


గోరంట్లలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: రాష్ట్రంలోని ప్రతి పేదవాడి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. గురువారం మండలంలోని గోరంట్ల గ్రామంలో ఎమ్మెల్యే గ్రామ సర్పంచు బాలక్రిష్ణతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే ప్రజలెదుర్కొంటున్న సమస్యలను గడప గడపకూ వెళ్లి స్వయంగా తెలుసుకున్నారు. గోరంట్లకు చెందిన ముల్లా మాబున్ని మాట్లాడుతూ ఆధార్‌లో తన వయస్సు 36గా తప్పుగా పడడంతో ప్రభుత్వ పథకాలందడం లేదని, వాస్తవానికి తన కుమారుడి వయస్సే 35 సంవత్సరాలని తెలిపారు. ఈ సమస్య పరిష్కరించాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని మాబున్ని ఎమ్మెల్యే ముందు వాపోయారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ధ్రువపత్రాలు పరిశీలించి ఆధార్‌లో వయస్సు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అలాగే తమకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కొందరు, వీధి లైట్లు,రోడ్లు వేయించాలంటూ మరికొందరు ఎస్సీ కాలనీవాసులు ఎమ్మెల్యేకు విన్నవించారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలందేలా చూడడంతో పాటు గ్రామాల్లో రోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే ఎంపీడీఓ చంద్రశేఖర్, పీఆర్ ఏఈ గంగరాజుకు ఆదేశించారు.

నేడు ప్యాలకుర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా.సుధాకర్ అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తారన్నారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

అన్ని సమస్యలను పరిష్కరిస్తా

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తెలుసుకున్న ప్రతి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి తావులేకుండా పాలన అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలులో అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవీలత, స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, బాలు, నాయుడు, మనోహర్, గోపాల్, రాజు, మద్దయ్య మధు సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు


గడివేముల వ్యవసాయ కార్యాలయంలో వీఏఏలతో మాట్లాడుతున్న ఏఓ

గడివేముల: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో 14 ఆర్బీకేల వీఏఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 8,182 హెక్టార్లలో పత్తి, మిరప, వరి, మొక్కజొన్న, మినుము, సోయాబీన్ తదితర పంటలు సాగు చేస్తారన్నారు. ఇందుకు మండలంలోని రైతులకు 5,410 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ఇప్పటికి 3,174 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ, ఎస్ఎస్‌పీ, ఎంఓపీ అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. కావాల్సిన రైతులు రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి తీసుకోవాలన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్ట్ చేయాలి


కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఐద్వా సంఘం నాయకులు

కల్లూరు: రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా సంఘం) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణమ్మ, అలివేలమ్మ డిమాండ్ చేశారు. గురువారం కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో కల్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద తమకు న్యాయం కావాలని రెజ్లర్లు శాంతియుతంగా నిరసన చేస్తుంటే వారిని బలవంతంగా ఖాళీ చేయించారన్నారు. ప్రజాస్వామ్యదేశంలో మహిళలకు భద్రత కరువవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.మధు, మహిళ సంఘం నాయకులు సుజాత, కోమలి, రమణమ్మ, పద్మ, రామేశ్వరమ్మ, రేవతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న అదనపు తరగతి గదులు

- శరవేగంగా జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మాణ పనులు
- మరో 15 రోజుల్లో తరగతి గదుల ప్రారంభం


తుదిదశకు చేరిన తరగతి గదుల నిర్మాణ పనులు

గూడూరు: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు– నేడు పథకం కింద రూ.1.20 కోట్లతో చేపట్టిన పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పాఠశాలలో 730 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. తరగతి గదులు తక్కువగా ఉండటంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. ఉపాధ్యాయులు ఆరుబయట కూర్చొబెట్టి పాఠాలు చెబుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గతేడాది పాఠశాలకు 12 అదనపు తరగతి గదులను మంజూరు చేసింది. ఇందుకు రూ.1.20 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో ప్రస్తుతం నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతుండటంతో విద్యార్థినుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేసున్నారు. కాగా మరో 15 రోజుల్లో కొత్తగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను ప్రారంభిస్తామని ఎంఈఓ సునీలమ్మ తెలిపారు.

క్రైం కార్నర్

కోలుకోలేక యువకుడి మృతి

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు సమీపంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన మేరకు వివరాలు.. తాను ప్రేమించిన అమ్మాయి చనిపోయిందని మిడుతూరు మండలం, పీరుసాహెబ్‌పేటకు చెందిన జరపాటి శ్రీనివాసులు కుమారుడు జరపాటి ప్రసాద్ అలియాస్ రామ్ ప్రసాద్(26) ఈ నెల 3వ తేదీ రాత్రి 10.40 గంటల సమయంలో ఓర్వకల్లు హైవే పక్కన గల ఇటుకల బట్టి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోలుకోలేక గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి ..

పాణ్యం: రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మండల కేంద్రం రైల్వే స్టేషన్‌లో గురువారం ఈ ఘటన జరిగింది. మృతుడు ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లెకు చెందిన కె. వీరయ్య(25)గా రైల్వే పోలీసులు గుర్తించారు. ప్రమాదంపై గుంటూరు వెళ్లే ప్యాసింజర్ రైలు పైలెట్ ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ జలీల్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. లభించిన ఆధారాల ద్వారా కుటుంబ సభ్యులకు ఆయన సమాచారం ఇచ్చారు. బనగాపనపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన సుభాషిణితో మృతుడికి వివాహమైంది. వీరికి ఓ కుమార్తె సంతానం. అయితే, భార్యాభర్తల మధ్య మనస్పర్థలే ఈ ఆత్మహత్యకు కారణమని తెలుస్తోందని రైల్వే ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మద్యం విక్రయదారుల అరెస్టు

కర్నూలు : కర్నూలు బుధవారపేటకు చెందిన దరూరు ప్రసాద్, బోయ మధులను మూడవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. బుధవారపేటలోని శ్మశానం రోడ్డులో తెలంగాణ మద్యం విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో సీఐ మురళీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు నిఘా వేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద పది తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.